క్లుప్తంగా

విద్యుత్ మీటర్ల దరఖాస్తులపై సమీక్ష

చండ్రుగొండ: కొత్త విద్యుత్ మీటర్ల దరఖాస్తులు, వాటి ఆన్‌లైన్ ప్రక్రియపై సోమవారం ట్రాన్స్‌కో ఏడీఈ యండి.యాసీన్ సమీక్షించారు. చండ్రుగొండలోని విద్యుత్ కార్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చండ్రుగొండ మండలంలో 285, అన్నపురెడ్డిపల్లిలో 180, సూతనగర్‌లో 220, జూలూరుపాడు మండలంలో 245 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్తలైన్లు, కొత్త మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట ఏఈ ఎంఎల్.నర్సింహారావు, అన్నపురెడ్డిపల్లి ఏఈ సాయిటాటున్, సిబ్బంది ఉన్నారు.

కోడిగుడ్లు పగలగొట్టారు..



అంగన్‌వాడీ కేంద్రంలో పగిలిపోయి ఉన్న గుడ్లు

ములకలపల్లి: మండల పరిధిలోని పొగళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోని కోడిగుడ్లను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టారు. హైస్కూల్ ఆవరణలో అంగన్‌వాడీ బీసీ, ఎస్సీ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్ల పరిధిలోని మొత్తం 30 మంది చిన్నారులున్నారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్ సునిత సెంటర్‌కు వచ్చి చూడగా, గదుల్లోనూ, బూత్‌వద్ద కోడిగుడ్లు ధ్వంసం చేసి ఉన్నాయి. సుమారు ఐదు ట్రేల కోడిగుడ్లు పగులగొట్టినట్లు తెలిసింది. ఈ విషయమై పొగళ్లపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ సామ్రాజ్యాన్ని వివరణ కోరగా, తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపడతామని తెలిపారు.

ప్రతిభా పురస్కార గ్రహీతకు సన్మానం

బూర్గంపాడు: మోరంపల్లిబంజర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీపండిట్ బి.బాలుకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం దక్కింది. ఇటీవల సూర్యాపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనను సోమవారం మోరంపల్లిబంజర జెడ్పీఎస్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. మెరుగైన విద్యాబోధన, నూరు శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధిస్తున్నందుకు గాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది. ఆయనను సన్మానించిన వారిలో బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బి నాగేశ్వరరావు, న్యూసెంచరీ స్కూల్ కరస్పాండెంట్ ఆశిక్, ఉపాధ్యాయులున్నారు.

స్టేషనరీ వితరణ

కరకగూడెం: విద్యతోనే జ్ఞానం.. జ్ఞానంతోనే విజయాలు సాధ్యమని రిటైర్డ్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాడి మురళీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం 'మాతృ అభయ ఫౌండేషన్'ఫౌండర్ రామాటెంకి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కరకగూడెం, అనంతారం, చొప్పల, శ్రీరంగాపురం, రేగుళ్ల, చిలకలగుంపు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పలకలు, బ్యాగులు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, క్రీడా దుస్తులను మురళీధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ పినపాక జెడ్పీటీసీ సభ్యురాలు జాడి జానమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్ ఆయన సతీమణి దేవి పలువురు ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సహకరించాలి

అశ్వారావుపేటరూరల్: విద్యాభివృద్ధిలో విద్యాశాఖ అధికారులకు ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి పి.ప్రసాద్‌రావు కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం మండలంలోని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. అనంతరం నూతనంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనను సంఘాల బాధ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. మడివి కృష్ణారావు, హలావత్ హరిబాబు, శ్రీశైలం(సిద్ధు), సున్నం నాగేశ్వరరావు, మాధవరెడ్డి, లక్ష్మీనర్సు, పద్దం రాము, సీతారాములు పాల్గొన్నారు.

పునరుద్ధరించండి..

మణుగూరుటౌన్: మణుగూరు రైల్వేస్టేషన్ నుంచి రద్దు చేసిన రైలు సర్వీసులు అన్నింటినీ వెంటనే ప్రారంభించాలని సింగరేణి, విజయవాడ ప్యాసింజర్ ట్రైన్లను మణుగూరుకు పొడిగించాలని కోరుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్టేషన్ మాస్టర్ శుభోద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణుగూరు నుంచి నడిచే రైలు సర్వీసులు కరోనా కారణంగా రద్దు చేశారని అనంతరం దేశంలోని అన్ని సర్వీసులు పునరుద్ధరించినా మణుగూరు నుంచి రైలు సర్వీసులను వదిలేశారన్నారు. రైలును నిర్దిష్ట సమయానికి ప్రయాణికులు గమ్య స్థానం చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన స్టేషన్ మాస్టర్ సౌత్ సెంట్రల్ జీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నాయకులు మల్లెల రామనర్సయ్య, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఆకులపల్లి చంద్రశేఖర్ ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సిబ్బంది
- గర్భిణులకు సామూహిక సీమంతాల నిర్వహణ
- వయోవృద్ధుల వారోత్సవాలు కూడా..



మణుగూరురూరల్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుశీల



దమ్మపేట: సామూహిక సీమంతాలు నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మణుగూరురూరల్: పోషకాహారం వల్ల ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ మణుగూరు సెక్టార్ సూపర్‌వైజర్ జి.సుశీల తెలిపారు. సోమవారం సెక్టార్ పరిధిలోని మణుగూరు–3 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించి వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుశీల మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఎంఎల్‌హెచ్‌పి బి.లక్ష్మి, ఆశావర్కర్లు తార, మంగ, ఆయాలు, పిల్లల తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాజెక్టు మారాయిగూడెం సెక్టార్ పరిధిలోని అడవిరామవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంబరాలు సోమవారం నిర్వహించారు. పౌష్టికాహారం ప్రదర్శన చేసి వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా గ్రామంలో వృద్ధుల సమావేశం నిర్వహించారు. వారి హక్కుల గురించి అవగాహన కల్పించారు. పోషణ ప్రతిజ్ఞ, వృద్ధుల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మారాయిగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు, వృద్ధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ్‌మహా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని గండిపోలు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. జగన్నాథపురం క్లస్టర్ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ.. పోషకాహార ఆవశ్యకతను వివరించారు. బాలమణి, నాగేశ్వరి, సునిత, రాజేశ్వరి, మణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: పోషణ్ అభియాన్ మాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ దమ్మపేట వారి ఆధ్వర్యంలో ఆయా సెక్టార్ల పరిధిలోని గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మల్లారం సెక్టార్‌లో గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు సీమంతాలు నిర్వహించగా, ఈ కార్యక్రమంలో సీడీపీఓ హేమ సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవలసిన పోషకాహారం, జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాలమ్మ, అంగన్‌వాడీలు ,ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనతో ప్రజలకు చేరువయ్యాం



ఆశ్రమ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీ తీసుకునే ప్రతీ నిర్ణయంలో ప్రజా సంక్షేమం దాగి ఉందని, ఆ ప్రజాపాలనతో ప్రజలకు చేరువయ్యామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత చొప్పల పంచాయతీలోని శ్రీరంగాపురంలో రూ.1 కోటి 64 లక్షల వ్యయంతో నూతన బీటీ రోడ్డుపనులకు శంకుస్థాపన చేసి తాటిగూడెం, కరకగూడెం, వట్టం వారిగుంపు గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 30లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే చిరుమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణుల సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడే ఉన్న ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. భోజనశాలను పరిశీలించారు. వంటలను రుచి చూసి చప్పగా ఉండడం, మెనూను సరిగ్గా పాటించకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశాఉ. ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అనంతరం సుమారు రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన వట్టంవారి గుంపు, చిరుమళ్ల నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఆ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. చిరుమళ్ల గ్రామ పంచాయతీ స్థలదాత, దివంగత మాజీ సర్పంచ్ చందా నర్సింహారావు కుటుంబ సభ్యులను అభినందిచారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు పోలెబోయిన శ్రీవాణి, తిరుపతయ్య, తోలెం నాగేశ్వరరావు నాయకులు ఎర్ర సురేష్, జలగం కృష్ణ,పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

63 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న ఏరియా జీఎం దుర్గం రాంచందర్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో 63 శాతం బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత లక్ష్యం 75 శాతం సాధించామని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ నెలలో 8.76 లక్షల టన్నులకు గాను 5.53 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఏప్రియల్ నుంచి సెప్టెంబర్ వరకు రైలు, రోడ్, రోప్ ద్వారా 52.03 లక్షల టన్నులు తరలించామన్నారు. హాల్ రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ఓబీ వెలికితీతకు బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని వెల్లడించారు. 30,099 లక్షల గ్యాలెన్ల నీరు గనుల్లో నిలిచి ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపాయని వాటిని పైపుల ద్వారా తొలిగించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అయినా మణుగూరు ఓసీలో నేటికీ బొగ్గు బేంచ్‌లు నీట మునిగే ఉన్నాయని తెలిపారు. వర్షాల ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని వార్షిక లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, ఆర్.వెంకటేశ్వర్లు, వెంకట్రావ్, వెంకటేశ్వర్లు, సలగల రమేష్, కె. వెంకటేశ్వర్లు, మేరీ కుమారి, శ్రీనివాస్, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల అందజేత

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన దివ్యాంగుల బస్‌పాస్‌లకు 46 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఆర్టీసీ సిబ్బంది బంగారు రాజు, కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

మణుగూరురూరల్: ఇటీవలే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతిని మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంఈఓను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు యూసఫ్ షరీఫ్, ఐజాక్ థామస్, మాదాసు అరవింద్ కుమార్, శ్రీనివాసరావు, గంగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి వినతి

ములకలపల్లి: సెర్ప్‌లో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ములకలపల్లికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రతీనెలా నేరుగా వేతనాలు ఇవ్వాలని, టీఏ, డీఏ, స్టేషనరీ అలవెన్స్‌లతోపాటు భీమా, గ్రాడ్యువిటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎస్ఓటూ జీఎంకు వినతి

మణుగూరుటౌన్: లాభాల వాటా పంపిణీ లెక్కింపు సమయంలో గ్రూప్ ఫర్ పర్‌ఫార్మెన్స్ పేరిట కేపీయూజీ మైన్ కింద ఉన్న కార్మికులకు తీవ్రమైన ఆర్థిక నష్టం జరుగుతోందని, శ్రమకు తగిన ఫలితం అందించాలని కోరుతూ టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. కార్మికులు పనిచేయని చోట గ్రూప్ పర్‌ఫార్మెన్స్‌ను పరిగణలోకి తీసుకోవడం వల్ల ఆ కార్మికులు సగటున 30–40వేలు వరకు నష్టపోతున్నారని తెలిపారు. బంగారి పవన్‌కుమార్, మస్తాన్, చింతచెట్టు, ముకేశ్, పద్దం శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, వినయ్ కుమార్, మునిగెల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

లిఫ్ట్‌ను ప్రారంభించాలి

ములకలపల్లి: తిమ్మంపేట శివారులోని పుట్టతోగు సమీపంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించి, రైతులకు అందుబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. తిమ్మంపేటలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ శాఖా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం.జ్యోతి, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, గౌరి నాగేశ్వరరావు, ఊకంటి రవికుమార్, మాజీ సర్పంచ్ గౌరి లక్ష్మి, బేతి అమల, అమర్నాథ్, రావుల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రావలసిన 20 నెలల వేతన బకాయిలను దసరా పండుగ లోపే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పీఎంహెచ్ హాస్టల్స్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించింది. ధర్నా సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి మాట్లాడారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, హీరాలాల్, పీఎంహెచ్ హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రామ, జయ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలకు ఊతం



మహిళా సమాఖ్య సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


ములకలపల్లి: సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంకిత మహిళా సమాఖ్య ప్రగతిపథంలో ముందుకు సాగుతూ ఆదర్శప్రాయంగా నిలవాలని, తన నిధులకు నుండి కోటి రూపాయలను సైతం సమాఖ్య కేటాయిస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలపరిధిలోని పలుగ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. నర్సాపురం, జగన్నాపురం, పూసుగూడెం, పాతూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డైరీ ఫాం, నాటుకోళ్ల, చేపలు, పుట్టగొడుగుల పెంపకం, పచ్చళ్ల తయారీ యూనిట్లను స్వయంగా పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ములకలపల్లిలోని కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షురాలు బైటి బాయమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 18వ జనరల్‌బాడీ సమావేశంలో ముఖ్యఅతిగా పాల్గొని మాట్లాడారు. 1982లో సంఘాల రూపకల్పన జరిగినా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే చేయూత దక్కిందని అన్నారు. విరివిరిగా నిధులు కేటాయించిన సమైఖ్యలకు ఊతమిచ్చారని పేర్కొన్నారు. మండలపరిధిలో ఈయేడాదిలో రూ.25 కోట్ల బ్యాంక్ లింకేఈతోపాటు. రూ.5 కోట్ల స్త్రీనిధి లక్ష్యాన్ని ఖచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు, తదుపరి రూ.5 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యేకు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు, తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ లక్ష్మయ్య, ఏకేపీ ఏపీఎం సంపత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, గాడి తరుపతిరెడ్డి, కారం సుధీర్, కుంజా రవి, సురభి రాజేష్, మడకం చిరుమప్ప, వెంకటేష్, కటికనేని ఆదిత్య పాల్గొన్నారు.

'వర్ణ వ్యవస్థను ప్రోత్సహిస్తున్న కేంద్రం'

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వర్ణ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకురాలు సున్నం లక్ష్మి విమర్శించారు. చింతా లక్ష్మీనగర్‌లో సోమవారం కుల నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూర్వం ఉన్న చాతుర్వర్ణ వ్యవస్థను మళ్లీ పెంచి పోషించే కుట్ర జరుగుతోందన్నారు. ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన వారిని అంటరాని వారిగా చూసే ప్రక్రియకు మళ్లీ బీజం పడుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మమని ఆదివాసీలను, దళితులను దూరం పెట్టి వారిపై దాడులకు ఉసిగొల్పుతున్నారన్నారు.

దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టి నిమ్న కులాలకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రణయ్ కుమార్, రాపర్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎదుట రైతుసంఘం ఆందోళన



బూర్గంపాడు ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న రైతుసంఘం నాయకులు

బూర్గంపాడు: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బూర్గంపాడు బ్రాంచ్ వద్ద సోమవారం సీపీఐ అనుబంధ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకుడు మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ.. బూర్గంపాడు ఎస్‌బీఐలో పోలవరం ముంపు బాధిత రైతులు ఒకసారి తీసుకున్న పంటరుణాలకు బ్యాంకు అధికారులు రెండుసార్లు రికవరీలు చేసి రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఆయా రైతులకు రుణమాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్‌తో ముంపుకు గురయ్యే కుక్కునూరు, వేలేరుపాడు. బూర్గంపాడు మండలంలోని ముంపు గ్రామాల రైతులు ఏళ్ల కాలం నుంచి బూర్గంపాడు ఎస్‌బీఐలో పంటరుణాలు తీసుకుంటున్నారన్నారు. 2017లో ముంపు భూములకు పరిహారం కింద రైతులు ఖాతాల్లో నగదు జమకాగా.. ఆ నగదుతోపాటు మరో సారి బ్యాంక్ వారు అప్పుకింద రైతుల నుంచి వసూలు చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించి వినతిపత్రం ఇస్తే తీసుకునేందుకు కూడా బ్యాంకు మేనేజర్ నిరాకరించాడని ఆయన ఆరోపించారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పేరాల శ్రీనివాస్, ఎస్.సుబ్బారెడ్డి, మద్దిబోయిన వెంకట్రావు,భాగం శ్రీనివాసరావు,మడిపల్లి వెంకటరమణ, పారుపల్లి శ్రీనివాస్,నోముల సావిత్రి పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడల్లో సత్తా

మణుగూరురూరల్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఇటీవల జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో మణుగూరు ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. క్రీడాపోటీల్లో అండర్–14 విభాగంలో ఎస్.వఫీక, ఖోఖోలో ఎస్.చారుణ్య, అత్యుత్తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్‌లు సోమవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి క్రీడలకు ఎంపిక

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం గ్రామంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో జోనల్‌స్థాయి క్రీడలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి క్రీడలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గేమ్స్ కన్వీనర్ సోమశేఖర్, జోనల్ గేమ్స్ సెక్రెటరీ వసంతం, పీడీలు నాగేశ్వరరావు, జయ, పీఈటీలు వెంకటేశ్వర్లు, జానకి, పార్వతి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ'తో తాగునీటి సరఫరా పటిష్టం



మాట్లాడుతున్న ఎస్ఈ సదాశివ కుమార్

అశ్వారావుపేటరూరల్: తాగునీటి సరఫరాను మరింత పటిష్టం చేసేందుకు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సకాలంలో అందించే ఉద్దేశంతో ప్రభుత్వం తాగునీటి సహాయకుల వ్యవస్థను తీసుకొచ్చిందని ఉమ్మడి జిల్లా మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ తాగునీటి సహాయకులకు ఎలక్ట్రికల్ మెటార్లు, పంపు సెట్‌లపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడటంతోపాటు, పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. తాగునీటి సరఫరాలో ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా డీఈఈ సలీం, ఏఈఈ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎల్ఆర్ బోనస్ చెల్లించాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్‌పాషా

మణుగూరురూరల్: సింగరేణి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములవుతున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా పీఎల్ఆర్(దీపావళి) బోనస్ చెల్లించాలని ఇఫ్టూ అనుబంధ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌డి.నాసర్‌పాషా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన ఏరియా కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించిన విధంగానే వారి శ్రమను గుర్తించి దీపావళి బోనస్ కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగోత్ మంగిలాల్, చల్లా కాంతారావు, దేవేందర్, సాధనపల్లి రవి, పెనుగొండ నాగార్జున, కృష్ణ, గౌరి, పద్మ, కృష్ణకుమారి, కిరణ్, మహేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ

చర్ల: మండలంలోని మారుమూల ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పీవీ రమణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని గోరుకొండ, బెస్త కొత్తూరు, ఆంజనేయపురం, పెదమిడిసిలేరు, చిన మిడిసిలేరు, రాళ్లగూడెం, తేగడ గ్రామాల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. విద్యార్థుల ప్రగతితో పాటు ఉపాధ్యాయుల హాజరు తీరును తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా పలు పాఠశాల్లో ఉపాధ్యాయులను హెచ్చరించారు.

పీఆర్సీ ప్రకటించాలి

గుండాల: ఉపాధ్యాయులకు డీఏలు ఇచ్చి పీఆర్సీలు ప్రకటించాలని జిల్లా కార్యదర్శి బాలునాయక్ డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో పలు పాఠశాలలో సభ్యత్వ సమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయ లకు డీఏ ఇచ్చి పీఆర్‌సీ పకటించాలని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని కోరారు. 25 జీఓను సవరించి హేతుబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, కాంతారావు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

భద్రాచలం: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురికి ఈ చెక్కులను అందచేశారు. పార్టీ నాయకులు నాయకులు రత్నం రమాకాంత్, అరికెల తిరుపతిరావు, నర్రా రాము, భోగాల శ్రీనివాస్ రెడ్డి, మామిడి పుల్లారావు, భీమవరపు వెంకటరెడ్డి, ప్రసాద్ రాజు, అన్నెం రామిరెడ్డి, బండారు నాగేశ్వరావు, ఒగ్గె రమణ, యూత్ నాయకులు గాడి విజయ్, పుల్లగిరి నాగేంద్ర, కల్లూరి భాను, జమిర్ పాల్గొన్నారు.

హక్కులకు విఘాతం

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికహక్కులకు భంగం కలుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి ఆరోపించారు. టేకులచెరువు గ్రామంలో సోమవారం జరిగిన పార్టీ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా బోళ్ల శ్రీశైలంను ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, గుంటక కృష్ణ, శ్యామల అజయ్‌కుమార్, రాయల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బుచ్చిరాములు, ఉపేందర్, వరమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. సోమవారం కళాశాలలోని విద్యార్థినిలు, బోధన సిబ్బంది కలిసి బతుకమ్మలు తీసుకొచ్చి, సంప్రదాయం ఉట్టి పడేలా ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకని అన్నారు. బతుకమ్మ సంస్కృతిని రక్షించుకుని, భవిష్యత్ తరాలకు చేర్చాలని సూచించారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.